

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.4, కనిష్ఠం 22.9
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
సోమవారం 26 ఆగస్టు 2024







'నామినేటెడ్'పై నేతల దృష్టి

పదవుల భర్తీకి ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్

- పోటీ పడుతున్న ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు
- ఈ దఫా జిల్లాకు దక్కనున్న మంత్రి పదవి
- పీసీసీ కూడా జిల్లాకు కేటాయించే అవకాశం
- ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న ఆశావహులు

నిజామాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీకి కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతల్లో కదలిక మొదలైంది. మొదటి విడతలో పదవులు రాని నేతలంతా మళ్లీ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. తమకు ఈ దఫా అవకాశం వస్తుందని భావిస్తున్నారు. రాష్ట్ర పార్టీలో కీలక పదవులతో పాటు జిల్లా నుంచి ఈ దఫా మంత్రి పదవి కూడా రానుండటంతో పార్టీ క్యాడర్‌లో జోష్ పెరుగుతోంది. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులతో పాటు జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టులు కూడా భర్తీ చేయనుండటంతో ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు దగ్గరగా ఉన్న నేతల ద్వారా సీఎంతో పాటు ఇతర నేతలను కలుస్తూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కొంత మంది నేతలు మంత్రుల ద్వారా ఏఐసీసీ ఇన్‌చార్జిలను కలుస్తూ ప్రయత్నాలను చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా నేతల భారీ ఆశలు..

రాష్ట్రంలో పీసీసీ అధ్యక్ష పదవితో పాటు మంత్రి వర్గం రెండో విస్తరణ, నామినేటెడ్ పదవులకు ఏఐసీసీ నేతలు సానుకూలంగా స్పందించడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు భారీ ఆశలను పెట్టుకున్నారు. ఈ దఫా పదవులు వస్తాయని భావిస్తున్నారు. మొదటి మంత్రివర్గ విస్తరణలో అవకాశం రాకపోవడం వల్ల ఈ దఫా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో ఖరారైనట్లు తెలుస్తోంది. రెండో దఫా ఆరు మంత్రి పదవులను భర్తీ చేయనుండటంతో ఉమ్మడి జిల్లా నుంచి ఆయనకు ఈ బెర్త్ ఖాయమైనట్లు రెండోదఫా మంత్రివర్గ విస్తరణలో మొదటగా ఆయన పేరునే ఖరారు చేశారని పార్టీ నేతలు తెలిపారు. ఈ పదవులతో పాటు ఉమ్మడి జిల్లా నుంచే అవకాశం పీసీసీ అధ్యక్షుడిగా రానున్నట్లు తెలుస్తోంది. పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌తోపాటు జిల్లా నుంచి రెండు దఫాలు ఎంపీగా పనిచేసిన మధుయాష్కిగౌడ్ పోటీలో ఉన్నారు. మహేష్‌కుమార్‌గౌడ్‌కు అవకాశం ఉంటుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో జిల్లాకు పదవులు..

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటి వరకు ఎనిమిది పదవులను ఇచ్చారు. మొదట పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా మాజీ మంత్రి షబ్బీర్ అలీని నియమించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా తాహెర్‌బిన్ హందాన్‌ను, రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ ఛైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా మాజీ విప్ ఈరవత్రి అనిల్‌ను, ఆగ్రో సంస్థ ఛైర్మన్‌గా కాసుల బాల్‌రాజ్‌ను నియమించారు. ఈ మధ్యనే రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుగా మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. ఉమ్మడి జిల్లాలో కీలకమైన పదవులు భర్తీ చేశారు. గత ఎన్నికల సమయంలో సీట్లు వదులుకున్న నేతలకు పదవులను కట్టబెట్టారు. ఉమ్మడి జిల్లా నుంచి మరికొంత మంది నేతలు ఉండటంతో వారిలో కొంత మందికి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులను ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. వారితో పాటు ఉమ్మడి జిల్లా స్థాయిలో పదవులను కూడా కట్టబెట్టనున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లా పరిధిలో మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ కమిటీలు, దేవాదాయ కమిటీలతో పాటు నుడా, ఇతర కమిటీలకు పాలకవర్గాలు లేవు. వీటన్నింటినీ త్వరలో భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది.

సీనియర్ నేతల ప్రయత్నాలు..

పదవులను భర్తీ చేయనున్నట్లు తెలియడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లతో పాటు జిల్లాలోని నామినేటెడ్ పదవులకు తమ పేర్లను పరిశీలించాలని కోరుతున్నారు. ఈ దఫా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పదేళ్లుగా పార్టీకి చేసిన సేవలను వివరిస్తున్నారు. కొంత మంది సీనియర్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తుండగా మరికొంత మంది మంత్రులను కలుస్తున్నారు. మరికొంత మంది ఏఐసీసీ ఇన్‌చార్జిలను కలుస్తూ తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ నేతలు హైదరాబాద్‌లో ముమ్మర ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

ఎస్సారెస్పీకి వరద ఉధృతి

- విష్ణుపురి, బాలేగామ్ నుంచి 34,952 క్యూసెక్కుల వరద
- ప్రాజెక్టులోకి 54.292 టీఎంసీల నీరు

నిజామాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సారెస్పీకి వరద ఉధృతి పెరిగింది. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడటంతో విష్ణుపురి, బాలేగామ్ ప్రాజెక్టులు నిండాయి. దీంతో ఆ ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆ ప్రాజెక్టుల నీళ్లు రావడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోనూ క్రమేపీ నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 34,952 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను 1083.2 అడుగులకు నీటిమట్టాలు చేరాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను 54.292 టీఎంసీలకు నీళ్లు చేరాయి. ప్రాజెక్టులోకి ఇప్పటి వరకు 55.192 టీఎంసీల నీళ్లు వచ్చి చేరాయి. ప్రాజెక్టు నుంచి 9.428 టీఎంసీల నీళ్లను ఆయకట్టుకు అందించారు.

ఆయకట్టు రైతుల్లో పెరిగిన భరోసా

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పెరుగుతుండటం సగానికిపైగా నీళ్లు రావడం వల్ల ఆయకట్టు రైతుల్లో భరోసా పెరుగుతోంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం వస్తే రెండో పంటకు నీళ్లు అందుతాయని భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా ఎల్ఎండీ ఎగువన ఉన్న మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల పరిధిలోని సుమారు 5లక్షల ఎకరాల వరకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఈ కాలువలతో పాటు లక్ష్మి, సరస్వతి కాలువల ద్వారా ఆయకట్టుకు నీటిని అందిస్తున్నారు. ఇవేకాకుండా గుత్ప అలిసాగర్ ఎత్తిపోతల పథకాలతో పాటు చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కూడా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో సుమారు 9లక్షల ఎకరాల వరకు నీటిని అందిస్తున్నారు. ప్రతిరోజూ 5వేల నుంచి 8వేల మధ్య వరద వస్తుండటంతో ఆ నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు. మరింత వరద పెరిగి ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగి 70 టీఎంసీలు దాటితే వరద కాలువ ద్వారా ఎల్ఎండీ, మిడ్‌మానేరుకు నీటిని తరలించేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు11.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా సాలూరా మండలంలో 37.5 మి.మీ వర్షం పడింది. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 639.4 మి.మీ వర్షం పడాల్సి ఉండగా 741.8 మి.మీ వర్షం పడింది. జిల్లాలో సరాసరి సగటు వర్షపాతం కంటే 102 మిల్లీమీటర్ల వర్షం ఎక్కువగా పడింది. జిల్లాలో 20 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం నమోదు కాగా 13 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతానికి మించి అత్యధికంగా వర్షం కురిసింది.





దరఖాస్తుల వెల్లువ

- జిల్లాలో ఇప్పటివరకు 17,284 మంది దరఖాస్తుల అందజేత
- పరిశీలించనున్న అధికారులు

నిజామాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):జిల్లాలో రుణమాఫీకి దరఖాస్తులు పెరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా లక్ష నుంచి రెండులక్షల లోపు రుణమాఫీ కాని రైతులు నోడల్ అధికారుల వద్దకు వస్తున్నారు. అన్ని గ్రామాలు, రైతువేదికల్లో ఈ దరఖాస్తులను అధికారులకు అందిస్తున్నారు. తమకు రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఒకవైపు జిల్లాలో ఆయా బ్యాంకుల ఎదుట, మండలాల్లో ధర్నాలు నిర్వహిస్తూనే ఈ దరఖాస్తులను అధికారులకు అందిస్తున్నారు. రుణమాఫీ ఎలాంటి షరత్తులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

ఐదు రోజులుగా వివరాల సేకరణ

జిల్లాలో రుణమాఫీ కాని రైతుల నుంచి అధికారులు గడిచిన ఐదు రోజులుగా వివరాలను సేకరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రుణమాఫీపై సమీక్షించి ఆయా మండలాలకు నోడల్ అధికారులుగా ఏవోలను నియమించారు. మండల వ్యవసాయ అధికారులతో పాటు ఎక్స్‌టెన్షన్ అధికారుల ద్వారా ఆయా గ్రామాల పరిధిలో సమావేశాలు నిర్వహించి ఈ వివరాలను తీసుకుంటున్నారు. వివిధ కారణాల చేత రైతులకు రుణమాఫీ కాలేదు. ఆ రైతులు మండలాల వారిగా ఈ దరఖాస్తులను చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 17,284 మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని దరఖాస్తులను చేశారు. పలు కారణాల వల్ల రైతులకు రుణమాఫీ కాలేదు. జిల్లాలో రేషన్‌కార్డు లేక కుటుంబ నిర్ధారణ కాకపోవడం వల్ల రుణమాఫీ కాలేదని 8,014 మంది రైతులు ఇప్పటి వరకు దరఖాస్తులను చేశారు. పట్టాదారు పాసుపుస్తకంతో పాటు రేషన్‌కార్డులో పేరులో తప్పులు ఉన్నాయని 1494 మంది రైతులు దరఖాస్తులు అధికారులకు అందించారు. ఆధార్ కార్డులో తప్పులు ఉన్నాయని రుణమాఫీ 847 మంది దరఖాస్తు చేశారు. నో డాటా కింద 2,518 మంది రైతులు, జీపిటి ఫెయిల్ పేరు మీద 110 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. సొసైటీ పరిధిలో ఆన్‌లైన్ కాలేదని 334 మంది రైతులు, పట్టాలో పేరు తేడా ఉందని 545 మంది రైతులు దరఖాస్తులు చేశారు. బ్యాంక్‌లో కాలేదని 690 మంది రైతులు దరఖాస్తులు చేశారు. ఇతర కారణాలతో 296 మంది దరఖాస్తు చేసిన వారిలో ఉన్నారు. వివిధ కారణాలతో రెండులక్షలలోపు రుణాలు ఉన్న రైతులు దరఖాస్తు చేయగా 2లక్షలకు పైనున్న రైతులు రుణమాఫీ కాలేదని 2,431 మంది దరఖాస్తులు చేశారు. ప్రభుత్వం నుంచి ఆన్‌లైన్ ఆప్షన్ రాగానే ఈ వివరాలన్నింటిని అధికారులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దరఖాస్తులను పరిశీలించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తున్నారు.



• వాగు వద్ద పర్యాటకుల సందడి



• అలుగు కింద పర్యాటకుల జలకాలు

రాళ్లవాగు వద్ద పర్యాటకుల సందడి

- మూడోసారి పొంగిపొర్లుతున్న వాగు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 25: మండలంలోని కోనాపూర్ రాళ్లవాగు ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఈ వానాకాలం సీజన్‌లో మూడోసారి వాగు పొంగిపొర్లడంతో ప్రాజెక్టు అందాలను తిలకించడానికి భారీగా తరలివచ్చారు. ఆదివారం వీకెండ్ కావడం తో పకృతి ప్రేమికులు వరుసకట్టి జలాశయం వద్దకు చేరుకున్నారు. జాలువారుతున్న జలాలతో జలకాలాడారు. ప్రాజెక్టు మత్తడి పైనుంచి పడుతున్న నీటిముందు సెల్ఫీలకు పోటీపడ్డారు. ప్రాజెక్టు అందాలను సెల్ ఫోన్‌లో బంధిస్తూ సందడి చేశారు. ప్రతీరోజు వందల సంఖ్యలో సందర్శకులు కుటుంబసభ్యులతో వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. అక్కడే వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేస్తున్నారు.

కాగా, రాళ్లవాగు వద్ద సందర్శకుల తాకిడి ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి సౌకర్యాలను కల్పించడం లేదు. సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతున్నా కనీస సదుపాయాలు లేవు. ముఖ్యంగా తీగునీరుతోపాటు సరైన రోడ్డు సౌకర్యం లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనాగ్రామ పంచాయతీ అధికారులు సందర్శకుల సౌకర్యార్థం కనీస వసతులు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.




• శిథిలావస్థ దశకు చేరిన నవీపేటలోని ఎస్సీ బాలుర హాస్టల్

• వాటర్ ఫిల్టర్ గదిలో గోడలు ఇలా..

శిథిలావస్థలో హాస్టల్ భవనం

- ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ఎస్సీ బాలుర హాస్టల్ భవనం
- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- నూతన భవనం నిర్మించాలని వేడుకోలు
- హాస్టల్‌లో వసతి పొందుతున్న 77మంది విద్యార్థులు

నవీపేట, ఆగస్టు 25: మండల కేంద్రంలో సుమారు 42ఏళ్ల క్రితం ప్రారంభించిన ఎస్సీ బాలుర హాస్టల్ భవనం ప్రస్తుతం శిథిలావస్థ దశకు చేరింది. 1982లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి భవనం వెంకట్రాం చేతుల మీదుగా ఈ హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ప్రస్తుతం హాస్టల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 77మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. హాస్టల్ భవనం చుట్టూ గోడలు పాకురు పట్టగా, వర్షపు నీటికి తేమ తేలింది. భారీ వర్షాలకు హాస్టల్ గదుల్లో వర్షపు నీరు చేరుతుందని విద్యార్థులు వాపోయారు. హాస్టల్ విద్యార్థులకు పడుకోవడానికి మంచాలు లేకపోగా వారు నిద్రించడానికి ఉపయోగిస్తున్న పరుపులు చిరిగిపోయాయి. హాస్టల్ భవనానికి చెందిన డైనింగ్ హాల్‌లో రాత్రిపూట చిన్న పిల్లలు పడుకుంటుండగా పెద్ద పిల్లలు హాస్టల్‌లో కొద్దిగా నయంగా ఉన్న గదుల్లో నిద్రిస్తున్నారు. విద్యార్థులకు ప్రతినెలా 62 రూపాయల చొప్పున కాస్మొటిక్ చార్జీలు చెల్లిస్తుండగా ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థ దశకు చేరిన హాస్టల్ భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నూతన హాస్టల్ భవనం నిర్మించాలి..

: దరావత్ శేఖర్, 10వ తరగతి, నవీపేట

ఎస్సీ బాలుర హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గోడలు పాకురు పట్టగా వర్షపు నీరు హాస్టల్ గదులలోకి చేరుతోంది. భయంతో రాత్రిపూట చిన్న పిల్లలు డైనింగ్ హాల్‌లో తాము కొంత నయంగా ఉన్న గదుల్లో పడుకుంటున్నాం. ఈ విషయంలో ఉన్నతాధికారువవెంటనే స్పందించాలి.

హాస్టల్ నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం..

: నర్సింలు, ఇన్‌చార్జి ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్

శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది. వర్షాకాలం కావడంతో పలు గదులలో వర్షపు నీటితో గోడలు తేమ తేలాయి. ముందు జాగ్రత్తగా రాత్రిపూట చిన్న పిల్లలను డైనింగ్ హాల్‌లో పడుకోబెడుతున్నాం. తాను ఎడపల్లి ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్‌గా పని చేస్తుండగా రెండు సంవత్సరాలుగా నవీపేట ఎస్సీ బాలుర హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్‌గా అదనపు విధులు నిర్వహిస్తున్నాను.



మధ్యాహ్న భోజనంపై కూరగాయల ధరల ప్రభావం



● బిల్లులు రాక ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు

మద్నూర్, ఆగస్టు 25: మార్కెట్‌లో పెరిగిన కూరగాయలు ఇతర నిత్యావసర సరుకుల ధరలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ప్రభావం చూపుతున్నాయి. పేద మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో ఆకలి వెతలు తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఇటీవల నిత్యావసర సరుకులతో పాటు కూరగాయాల ధరలు పెరగడంతో పథకం అమలులో ఏజెన్సీ మహిళలు అవస్థలు పడుతున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలంటే ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు బిల్లులు చెల్లింపులు జాప్యం జరుగుతుండటంతో నానా అవస్థలు పడుతున్నారు. సర్కారు బడుల్లో ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.5.45 పైసలు, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు కోడి గుడ్డు కాకుండా రూ.8.17 పైసలు, 9, 10వ తరగతి విద్యార్థులకు కోడిగుడ్డుతో పాటు రూ.10.67 పైసలు చొప్పున మధ్యాహ్న భోజనానికి చెల్లిస్తున్నారు. అయితే పెరిగిన ధరలు పరిగణలోకి తీసుకుంటే చెల్లింపులు సరిపోవడం లేదనేది ఏజెన్సీల వాదన. మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఒకటి నుంచి 8వ తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60-40 చొప్పున నిధులు కేటాయిస్తున్నాయి. 9, 10వ తరగతి విద్యార్థులకు అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 100 గ్రాములు ఉంటుంది. ఉన్నత పాఠశాల విద్యార్థులకు 150 గ్రాముల చొప్పున బియ్యాన్ని ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. పప్పులు, నూనె, కూరగాయాలు ఇతర వంట సామాగ్రి, వంట గ్యాస్, కుకింగ్ కాస్ట్ కింద బిల్లులను గత జనవరి వరకు చెల్లించింది. భోజన బిల్లులు మార్చి నెల వరకు చెల్లించారు. తొమ్మిది పదవ తరగతి విద్యార్థులకు ఈ ఏడాది జనవరి ఉంచి వేసవి సెలవుల నాటికి పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించినట్లయితే తాము ఆర్థికంగా నిలదొక్కుకుంటామని మహిళా సంఘాలు డిమాండ్‌చేస్తున్నాయి.














చిరుతిళ్లపై కమ్ముతున్న విషం!

● ఉమ్మడి జిల్లాల్లో జోరుగా నకిలీ బ్రాండ్‌ల పేరిట విక్రయాలు

● చిన్నారులే లక్ష్యంగా అక్రమార్కుల దందా

● తనిఖీలు చేపట్టని ఆహార నియంత్రణ అధికారులు

బాన్సువాడ, ఆగస్టు 25: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో చిరు తిళ్లపై విషం కమ్ముతున్నాయి. మార్కెట్‌లో జోరుగా నకిలీ బ్రాండ్‌ల పేరిట అక్రమ దారులు విక్రయాలు చేస్తున్నారు. చిన్నారులే లక్ష్యంగా వివిధ రంగు రంగుల ప్యాకింగ్ రూపంలో మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను చిరుతిండ్లకే అక్రమ దారులు జోరుగా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు తినే తిండ్లపై అసలు బ్రాండ్ లేకుండానే అందమైన ప్యాకింగ్‌లను రూపొందిస్తూ చిన్నారులు ఆకర్షితులయ్యే విధంగా తయారు చేస్తున్నారు. ఆకట్టుకునే బొమ్మలు, రంగుల రంగుల ప్యాకింగ్‌లతో చిన్నారుల చిరు తిండ్లను విక్రయిస్తున్నారు. చిన్నారులు అల్లరిని మాన్పించేందుకు తల్లిదండ్రులు ఏమి చేయలేక కొనివ్వక తప్పడం లేకపోయింది. ఉభయ జిల్లాల్లో చిరు తిండ్లపై కోట్ల రూపాయల్లో దందా కొనసాగుతుంది. నకిలీ బ్రాండ్ల పేరిట చిరు తిండ్లపై వైద్యులు చిన్నారులు తినవద్దంటూ వైద్య సలహాలు ఇస్తున్నా ఎక్కడ మాత్రం ప్రభావం కనిపించడం లేదు. దనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు ఈ దందాను మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. తక్కువ ధర పేరిట వ్యాపారాన్ని మార్కెట్‌లో ప్రారంభించి కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. చిరు తిండ్లపై ఉభయ జిల్లాల్లోని ఆహార నియంత్రణ అధికారులు మత్రం కన్నెత్తి చూడకపోవడం ఒకవైపు అయితే తనిఖీలు చేపట్టకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తక్కువ ధరలో ఆకర్షణీయమైన ప్యాకింగులు..

మార్కెట్‌లో చాలా వరకు చిన్నారులకు సంబంధించిన తిను బండారాలు తక్కువ ధరకే లభిస్తాయి. చిన్న పిల్లలను ఆకర్షించే విధంగా రంగు రంగుల ప్యాకింగులు చేపడుతున్నారు. ఒక్క రూపాయి నుండి 50 రూపాయలవరకు రకరకాల సైజులు, వివిధ రుచులు, ఫ్లేవర్లతో విక్రయాలు చేపడుతున్నారు. చూడటానికి ఆకర్షణీయమైన ప్యాకింగులు చూసి ఖరీదైన వస్తువు మాదిరిగానే కనిపిస్తున్నా వాటి ధర మాత్రం తక్కువనే. దీంతో చిన్నారులు వాటిని కొనేందుకు మారం చేస్తూ కొనేంత వరకువిడిచి పెట్టలేని విధంగా ఆకర్షితులను చేస్తున్నారు. అంతేకాకుండా మార్కెట్‌లో ఎక్కువగా క్రేజ్ ఉండే వాటి పేర్లనే చిరు తిండ్లకు మార్చడంతో పిల్లలు మరింత ఆసక్తిని పెంచుకుంటారు. ఇలాంటి చిన్న చిన్న వాటితోనే లక్షల రూపాయలదందాను కొనసాగిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

జోరుగా నకిలీ చిరుతిండ్ల విక్రయాలు కొనసాగుతున్నా చిన్నారులకు ప్రమాదమని తెలిసినా ఆయా జిల్లాల ఆహార నియంత్రణ అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. చిన్నారుల తినుబండారాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షించాల్సిన ఆహార నియంత్రణ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నారుల ప్రాణానికి ఏదైనా ముప్పు సంభవించినప్పుడే హడావిడిగా మార్కెట్‌లో దాడులు చేస్తూ తూతూ మంత్రంగా చేతులు దులుపుకుంటారు. కానీ, నకిలీ బ్రాండ్ల పేరిట, నాసిరకం చిరుతిండ్లపై నియంత్రణను మాత్రం చేపట్టడం లేదు.

నాసిరకం పదార్థాలు తింటే ప్రమాదకరం..

: శ్రీనివాస్ ప్రసాద్, పిల్లల వైద్య నిపుణులు, బాన్సువాడ

మార్కెట్‌లో నాసిరకం తిను బండారాలు చాలా వరకు లభిస్తున్నాయి. చిన్న పిల్లలు ఆకర్షితులై చిరు తిండ్లపై ఎక్కువగా మోజు చూ పెడుతున్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉండి, వివిధ రసాయనాలతో ప్రమాదకరంగా ఉన్న తిను భండారాలను తింటూ పిల్లలు తీవ్ర అనారోగ్యానికి గురవుతారు. నాణ్యత లేని చిరు తిల్లు తినకుండా పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి. నాసిరకం చిరు తిండ్ల పట్లచిన్నారులు దూరంగా ఉండటం చాలా మంచిది. ఇప్పటికైనా చిన్నారులు చిరుతిండ్లపై మోజు చూపకుండా ఇంట్లో వండిన ఆహారాన్నే తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

పాఠశాలల్లో ఘనంగా
శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు25: ఆర్మూర్ పట్టణంలోని శ్రీబాషిత హైస్కూల్‌లో ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధకృష్ణులు, గోపాల వేషాధారణలతో అందరిని అలరించారు. అనం తరం విద్యార్థినులు పలు సాంస్కృతిక నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు లోక భూపతిరెడ్డి, కోటపాటి నర్సింహంనాయుడు, కరస్పాండెంట్ పోలపల్లి సుందర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు. అదే విధంగా పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్‌లో శ్రీకృష్ణష్టామి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోస్రా: మండలంలోని చింతకుంట గ్రామంలోని నలంద విద్యానిలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల కరస్పాండెంట్ రేఖా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన పూజ కార్యక్రమాలు చేసి ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్థులు గోపిక, శ్రీకృష్ణుల వేషధారణలతో నృత్యాలు చేసి అలరించారు. కృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులు పోటాపోటీగా ఉట్టి కొట్టి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణష్టామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గోపూజ కార్యక్రమం నిర్వహించి భజనకీర్త నలు ఆలకించారు. అనంతరం కల్చరర్ అనంతరం జగన్నాథ్ బాలిదేవ సుభద్ర సుదర్శనకు 56రకాల నైవేద్యాలు సమర్పించి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు రామంతరాయ గౌరవదాస్, పట్టణ అధ్యక్షుడు హర్తిక ప్రభుజి గంగేశ్వర రామదాస్ ప్రభుజీ, నిమదాస్, భారత్ ప్రభు, కౌనిక్‌ప్రభు, జి.మణికంఠ, శ్రీకర్, భక్తులు పాల్గొన్నారు.

అడవి పందులను తరలిస్తున్న వాహనం పట్టివేత

నందిపేట, ఆగస్టు 25: నందిపేట మండలం శాపూర్ గ్రామంలో అడవి పందులను తరలిస్తున్న బోలెరో వాహనాన్ని ఆదివారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో కరెంటుషాక్‌తో వన్యప్రాణులను పట్టుకుంటున్నట్టు వచ్చిర రహస్య సమాచారం మేరకు అటవీ రెంజ్ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ రెంజ్ అధికారి సుధాకర్ శాపూర్ గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అందులో భాగంగా బోలెరో వాహనంలో వన్యప్రాణులను కాపాడడానికి వలలు, కత్తులను గుర్తించారు. బోలెరో వాహనం డ్రైవర్‌ను, ఇతరులను విచారించే ప్రయత్నం చేయగా పరారయ్యారని అధికారులు తెలిపారు. వన్యప్రాణాలను వేటాడిన, ఇతర ప్రాంతాలకు తరలించిన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో పాముకాటు భయం



కొత్తపల్లి సమీపంలో కొండ చిలువను చంపిన దృశ్యం(ఫైల్)

కోటగిరి,ఆగస్టు25: వర్షాకాలం వచ్చిందంటే చాలు రైతులు, వ్యవసాయ కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతుంటారు. ఆ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే తరుచు ఎవరో ఒకరు పాముకాటుకు గురవుతుంటారు.విషపూరిత సర్పాల బారిన పడిన వారు మృత్యువాత పడుతున్నారు.జిల్లా వ్యాప్తంగా పాముకాటు బాధితుల సంఖ్య క్రమేపీ పెరుగుతుంది. వ్యవసాయ క్షేత్రాల్లో రైతులు,కూలీల ఎంత జాగ్రత్తగా ఉంటున్నప్పటికీ కొందరు పాముల బారిన పడక తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో పాముకాటు మరణాలు క్రమేపి పెరుగుతున్నాయి. జిల్లాలో సంచరించే సర్పాల్లో 50శాతం విషపూరితమైన సర్పాలు ఉన్నాయి. ఒక్కోసారి కరిచిన ప్రతిసారి సర్పాలు విషాన్ని వదులుతాయని అనుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. అంతకుముందే అది దేనైనా ఆహారంగా తీసుకున్న ఇంకా ఎవరైనా కాటు వేసిన విష ప్రభావం తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఈసీజన్‌లో కోటగిరి ఉమ్మడి మండలంలో ఇప్పటి వరకుపదుల సంఖ్యలో పాముకాటు కేసులు నమోదయ్యాయి. పాముకాటు తీవ్రత అంతగా లేకపోవడంతో మెరుగైన వైద్యంతో బాధితులు బయటపడ్డారు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా రాష్ట్రప్రభుత్వం అవసరమైన యాంటి వీనం ఇంజక్షన్ నిల్వలను స్థానిక ఆసుపత్రుల్లో సమృద్ధిగా అందుబాటులో ఉంచింది.

● ఈ జాగ్రత్తలు మేలు

చిత్తడినేలలో వర్షాలు కురిసినప్పుడు విషసర్పాలు సంచారం ఎక్కువగా ఉంటుంది. రైతులు,కూలీలు మోకాలి వరకు బూట్లు ధరించాలి. పొలంగట్ల వెంట చెత్తచెదారంలో ఎలుకలు కనిపిస్తే అక్కడ పాములుఉన్నట్లు అనుమానించాలి.

- ఇళ్లలో కోళ్లు పెంచే చోట కోళ్లఫారాలు, పావురాలు, ఇతర పక్షు జాతులు పెంచేచోట త్రాచుపాములు,రక్తపింజర్లు చేరుతాయి.
- వర్షాకాలంలో వరద కారణంగా పాములు ఇళ్లలోకి వస్తుంటాయి. అందుకు తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- చాలా కాలం నుంచి కుప్పలుగా వేసిన బ్యాగులు, తట్టలను దులిపిన తర్వాతనే వినియోగించాలి.
- గట్లపైగడ్డి ఉన్న ప్రాంతాల్లో వెళ్లేటప్పుడు కర్రను వెంట తీసుకెళ్లాలి.అడుగువేయాల్సినచోటముందుకర్రపోటు పడాలి. అక్కడే అడుగును మోపాలి.
- పాము కరిచినప్పుడు భయపడితే గుండెపోటు,పక్షవాతం వచ్చే అవకాశం ఉంటుంది.
- ప్రమాదకరమైన పాములు నాగుపాము, రక్తపింజర, కట్లపాము వంటివి ప్రమాదకరమైనవి.అవి కనిపిస్తే అత్యంత అప్రమత్తంగాఉండాలి.పాములు పట్టే వారికి సమాచారం అందించాలి.

పాము కాటు వేసిన సమయంలో భయపడవద్దు



పాముకాటుకు గురైన బాధితులు ఎట్టి పరిస్థితుల్లో భయపడకూడదు. పాము కరిచిన కాళ్లను కదల్చరాదు. దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి వెంటనే తీసుకెళ్లాలి. కాటు వేసిన చోట చర్మానికి గాట్లు పెట్టవద్దు. తాడుతో బిగించడం వంటివి చేయవద్దు. ఎందుకంటే కొన్ని సర్పాలు విషపూరితమైనవి కావు. విష సర్పానికి రెండు కోరలు ఉంటాయి. గాట్లు రెండు ఉంటే అది విషపూరితమైనవి అని అర్థం. రెండు కంటే ఎక్కువ ఉంటే అవి విషసర్పం కాదని గమనించాలి. ఒక్కో సారి విషపూరితమైనవి కరిచిన ప్రభావం ప్రమాదకరంగా ఉండకపోవచ్చు.

\- సుప్రియ, వైద్యాధికారి, కోటగిరి

పర్ణశాల నిర్మాణానికి రూ.5లక్షల మంజూరు



సునీల్ కుమార్‌ను సన్మానిస్తున్న నాగాపూర్ గ్రామస్థులు

కమ్మర్‌పల్లి,ఆగస్టు25:కమ్మర్‌పల్లి మండలంలోని నాగాపూర్ గ్రామంలోగల హనుమాన్ ఆలయంలో పర్ణశాల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు అయినట్లు గ్రామమాజీ సర్పంచ్ పాలెపు నర్సయ్య తెలిపారు.పర్ణశాల నిర్మాణ ఆవశ్యకతను బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజికవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ దృష్టికి తీసుకురాగా స్పందిచిన ఆయన స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల నుంచి రూ.50 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు.నిధులు మంజూరి చేయించిన సునీల్‌కుమార్‌కు గ్రామహనుమాన్ భక్తులు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలుపు ఆదివారం సునీల్ కుమార్‌ను శాలువతో సన్మానించారు.కార్యక్రమంలో పాలేపు నర్సయ్య, మాజీఉపసర్పంచ్ కప్పదండి అశోక్, క్రీష్టడి మల్లయ్య,బాజన్న, శివానంద్,కిషన్, గంగాధర్, పెద్దులు, బాబూరావు, చందుగౌడ్, దిలీప్ గ్రామస్థులు పాల్గొన్నారు.

బోధన్‌లో మహిళ అదృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు25: బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన అర్మన్ ప్రతిమ అనే మహిళ అదృశ్యమైనట్లు భర్త నాందేశ్వర్ ఫిర్యాదులో పేర్కొన్నారని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. ఈ నెల 24వ తేదీన బయటకు వెళ్లి వస్తానని తిరిగి ఇంటికి రాలేదని బంధువుల వద్ద చుట్టూ పక్కల వెతికిన ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. నాందేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సీసీ పుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

వేల్పూర్‌లో ఎంపీ అర్వింద్ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వేల్పూర్, ఆగస్టు25: నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ 48వ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ నాయకులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అర్వింద్ వందేళ్ల పాటు ఆయురారోగ్యాలతో జీవించాలని నిజామాబాద్ జిల్లా ప్రజలకు వారి సేవలు అందించాలని బీజేపీ నాయకులు ఈసందర్భంగా దేవున్ని కోరారు.ఈకార్యక్రమంలో బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఏలేటి రమేష్‌రెడ్డి, మండల మాజీ వైస్‌ఎంపీపీ బద్దం రాజారెడ్డి, నాయకులు నోముల నర్సారెడ్డి, యాల్ల రమేష్, నోముల గంగారెడ్డి, ఏలేటి బాల్‌రెడ్డి, మహిపాల్, నరేష్, సచిన్, కుర్మరమేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగులో చిక్కుకున్న టాటాఏసీ వాహనం



పెద్దవాగులో టాటా ఏసీ వాహనాన్ని తీస్తున్న దృశ్యం

మోర్తాడ్, ఆగస్టు25: మండలంలోని పాలెం, దర్మోర గ్రామాల మధ్య గల పెద్దవాగులో ఆదివారం టాటా ఏసీ వాహనం చిక్కుకుంది. దర్మోరా గ్రామం నుంచి పాలెం గ్రామానికి వెళ్తుండగా వాగు ఉధృతంగా ప్రవహించడంపై పెద్దవాగు చెక్‌డ్యాంపై నిలిచిపోయింది. ఒక పక్క ఉధృతంగా వాగు పొంగిపోర్లుతుండగా ప్రమాదాన్ని గుర్తించిన దర్మోరా గ్రామస్థులు టాటాఏసీ వాహనాన్ని బయటకు తీసేందుకు ట్రాక్టర్‌తో ప్రయత్నించారు. అయిన ఫలితం లేకపోవడంతో జేసీబీ సహాయంతో టాటాఏసీని వాహనాన్ని బయటకు తీశారు. దీంతో టాటాఏసీలో వాహనంలో ఉన్న వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు, తమను ఆదుకున్న గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు. దర్మోరా గ్రామస్థులు సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : ట్రాఫిక్ ఎస్సై

ఖిల్లా,ఆగస్టు25:వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటరమణ తెలిపారు. నగరంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో ఆదివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు.రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసు శాఖతో ప్రజలు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రహ్మతుల్లా, సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

పాలెం నుంచి ధర్మోరా గ్రామానికి వాహనాలపై వెళ్లోద్దు

మోర్తాడ్: పాలెం గ్రామం నుంచి ధర్మోరా గ్రామానికి వెళ్లే వాహనదారులు పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల ఎవరు వెళ్లోద్దని ఎస్సై విక్రం తెలిపారు.ఆదివారం మండలంలోనిపెద్దవాగును పరిశీలించి చెక్‌డ్యాంపై వరద ప్రవహం ఎక్కువగా ఉన్నందున వాహనదారులు వెల్ల వద్దని వివరిం చారు.

● ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి..

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఆదివారం సాయంత్రం మంలంలోని దొన్కల్ గ్రామస్తులతో ఎస్సై విక్రం మాట్లాడారు. వాహనదారులు హెల్మెట్ ధరించకుంటే భారీగా జరిమానా విధిస్తామని తెలిపారు. వాహనదారులు హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

●హెల్మెట్ దరించని వాహనదారులకు జరిమానలు

డిచ్‌పల్లి: మండల కేంద్రం నాగపూర్ గేటు వద్ద ఆదివారం పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. హెల్మెట్ లేని ద్విచక్రవాహనదారులకు జరిమానలు విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనలు నడపవద్దని, బైకు కు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. హెల్మెట్ వాడకంతో ప్రాణాలు కాపాడుకోవచ్చు అని వాహనదారులకు అవగాహన కల్పించారు.

● హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి

ముప్కాల్: ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు హె ల్మెట్ ధరించి తమ ప్రాణాలు కాపాడుకోవాలనిబాల్కొండ హెడ్‌కానిస్టేబ్ జేవం త్ అన్నారు. ఆదివారం బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో ప్రధాన కూడలి వద్ద గ్రామస్థులకు హెల్మెట్ ధరించాలని, ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించారు.వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే నూతన నిబంధనల ప్రకారం అధికంగా జరిమానా రుసుము విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డు ప్రదానం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 25: నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ నిర్వాహకుడు మామిడాల మోహన్‌కు యూనివర్సల్ మెంటర్స్ అసోసియేషన్ హైదరాబాద్ ఎడ్యుకేషన్ ఐకాన్ 2024 అవార్డును అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్క్ హోటల్‌లో జరిగిన ఎడ్యులీడర్స్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ కార్యక్రమంలో ఈ అవార్డును ఆయనకు ప్రధానం చేశారు. విద్య విషయంలో ఆయన చేస్తున్న సేవలు, ఉత్తమ మార్గదర్శకునిగా ఈ అవార్డును 2023-24 సంవత్సరానికి అందజేశారు. యూనివర్సల్ మెంటర్స్ అసోసియేషన్ సీఈవో సందీప్ గులాటి, కో ఫౌండర్ అశుతోష్ దుబేలు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగుళూరు, మహారాష్ట్ర నుంచి ఎంపిక చేసిన 250 మందికి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, రాఘవేందర్, గోపాల్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానంద్, సుందర్, క్రాంతిగంగారెడ్డి, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు టెన్నికాయిట్ జట్ల ఎంపిక

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 25 : ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 27వ తేదీన జిల్లా సబ్ జూనియర్ టెన్నీకాయిట్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా టెన్నికయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిగౌడ్, ప్రధానకార్యదర్శి మల్లేష్‌గౌడ్‌లు తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 1-4-2010 తర్వాత జన్మించిన వారై ఉండాల న్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు ఆర్గనైజింగ్ కార్యదర్శి భూ పతికి రిపోర్టు చేయాలని సూచించారు. ఇతర వివరాలకు 950 2113860 నెంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

వేల్పూర్‌లో గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

వేల్పూర్, ఆగస్టు 25 : వేల్పూర్ మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆలయ మూడో వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం గంగమ్మతల్లికి గంగపుత్ర సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి ఆలయం వరకు గంగపుత్ర సంఘం మహిళలు బోనాలు తీయడం, నైవేద్యాలు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ పూజరి జుంబ రాతి రాజు ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి పంచామృతలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మగ్గిడి అశోక్, కార్యదర్శి తోపారం లక్ష్మణ్, గంగపుత్ర సంఘం సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

అర్మూర్‌టౌన్, ఆగస్టు 25 : పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగింపజేశారు. ప్రతీ ఆదివారం 2గంటల పాటు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలను, చెత్తచెదారాన్ని తొలగింపజేశారు. అలాగే మురికికాల్వలో ఉన్న చెత్తను తొలగించి శుభ్రపరిచారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీఒక్కరు తమ ఇంటి పరిసరాలను శుభ్రపర్చుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, కొక్కెర భూమన్న, కమలాకర్, ఎల్‌టి.కుమార్, గడ్డం శంకర్, ఎర్ర భూమయ్య, కొంతం రాజు, సతీష్, రవి, సాయన్న, ముత్తెన్న, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

- **ఆర్టీసీ బస్సులు సకాలంలో రాక గంటల తరబడి ఎదురు చూపులు**
- **బస్టాండ్ నిర్మాణం పూర్తి కాక రోడ్డుపై నిరీక్షణ**



ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 24 : ఆర్టీసీ బస్సులు ఎల్లారెడ్డి బస్టాండ్‌కు సకాలంలో రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఉదయం నుంచి చాలా మంది ప్రయాణికులు బస్టాండ్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు గంటల తరబడి రోడ్డుపై నిరీక్షించారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి కాక పోవడంతో పాటు ఆర్టీసీ బస్సు సర్వీసులు తగ్గించి నడుపుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. వివిధ గ్రామాలతో పాటు పట్టణాలకు చెందిన ప్రయాణికులు, విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సులు లేక బస్టాండ్‌లో గంటల తరబడి వేచి చూస్తు న్నారు. అయినప్పటికీ ఆర్టీసీ కంట్రోలర్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ సర్వీ సులను పెంచి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. అదే విధంగా బస్టాండ్ నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానికులు ప్రయాణీకులు కోరుతు న్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

ఎల్లారెడ్డి, ఆగస్టు 25 : ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్, సోమిర్యఘడ్ తండాలలో గిరిజనులు తీజ్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. గోదుమలను తొమ్మి రోజులు బుట్టలో నానబెట్టి, బుట్ట వద్ద ప్రతిరోజు సాయంత్రం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి సంతోషంగా నృత్యాలు చేశారు. తొమ్మిదో రోజు పూర్తయ్యే నాటికి మొలకల్లో కొన్నింటిని గిరిజన పెద్దల తలపాగాల్లో వేసి మిగిలిన వాటిని సమీపంలోని చెరువులో వదిలారు. అనంతరం బుట్టలను తెచ్చిన యువతుల కాళ్ళను సోదరులు కడిగి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నాగం గోపికృష్ణ, మాజీ సర్పంచ్ లాఖావత్ రవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న యువతులు

పొతంగల్‌లో వైద్య శిబిరం

కోటగిరి,ఆగస్టు25: పొతంగల్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ కోటగిరి ఆధ్వర్యంలో ఆదివారం ఆక్యుప్రెషర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ హెగ్డోలి శంకర్ ప్రారంభించారు. గ్రామంలో వారం రోజుల పాటు ఈ ఆక్యుప్రెషన్ వైబ్రేషన్ చికిత్స కొనసాగుతుందని ఆయన తెలిపారు. అధిక బరువు, మెడ నొప్పి, తలనొప్పి, రక్తపోటు, నిద్రలేమి, మధుమేహం, కీళ్ల నొప్పులు, కంటి, అసిడిటి, ఇతరత్రా సమస్యలకు చికిత్సలు అందిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంధపు పవన్, గంధపు రాజు, నాయకులు ఏజాజ్‌ఖాన్, వీరేశం, ధన్‌రాజ్, గంధపు దత్తు, శ్రీపాద్ పాల్గొన్నారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

మాక్లూర్, ఆగస్టు 25 : ఈనెల 31న, సెప్టెంబర్ 1, 2తేదీలలో హైదరాబాద్‌లో జరిగే ప్రగతి శీల మహిళా సంఘం ఏడో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నిజామాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి జైశెట్టి రాధ సూచించారు. ఆదివారం మండ లంలోని బోర్గం(కె) గ్రామంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ప్రతినిధుల సభలు ఉంటాయన్నారు. ఈ భవిష్యత్‌లో బల మైన ఉద్యమ కార్యాచరణకు రూపొందించుకుంటామని, ఇట్టి మహాసభలకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మ, సరోజన, కళావతి, గంగామణి, మధురి, తదితరులు పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి పరామర్శ

మెండోర, ఆగస్టు 25 : మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డిని రాష్ట్ర సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి అమ్మమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందడంతో మోహన్‌రెడ్డి, సునీల్‌కుమార్ పరామర్శించారు. వీరి వెంట టౌన్ అధ్యక్షుడు గుండోజీ రవి, గంగారెడ్డి, సాయరెడ్డి, రాజారెడ్డి, మౌలానా, ప్రమోద్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

ముప్కాల్, ఆగస్టు25: బాల్కొండ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని రవళి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో జిల్లా స్థాయి యోగా అసోసియేషన్ అండర్-16 విభాగంలో ఉత్తమప్రతిభ కనబరిచిన రవళి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 31 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థి పాల్గొనున్నారు. విద్యార్థికి ప్రతిభ పోటీల్లో ఎంపికకు కృషి చేసిన పీడీ ముత్తెన్నను అభినందించారు.

బాధిత కుటుంబానికి సునీల్‌రెడ్డి పరామర్శ

ముప్కాల్, ఆగస్టు25: బాల్కొండ మండల కేంద్రంలో మాజీసర్పంచ్ తాళ్ళ శ్రీనివాస్ గుండెపోటుతో మరణించడంతో విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ ఆది వారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కు టుంబానికి అండగా ఉంటానమి హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

● ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

బాన్సువాడటౌన్ , ఆగష్టు 25 : ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం కార్యదర్శి దోసెపల్లి శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ యాజమాన్యం రిటైర్డ్ ఉద్యోగులకు 2017 పే స్కేలు ఏరియర్స్ జాప్యం చేయకుండా చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ప్రభుత్వం ద్వారా అందించే ప్రయోజనాలను అందజేయాలని, కేంద్రం ఈపీఎఫ్ 95 పెన్షనర్లకు 7500 పెన్షన్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కౌసర్ , నాగ్‌నాథ్, గంగారాం, లక్ష్మణ్, సభ్యులున్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి



బీపీ మండల్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్ , ఆగష్టు 25 : పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్ మాట్లాడుతూ బీపీ మండల్ కృషితోనే బీసీ లకు రాజ్యాంగంలో రిజర్వేషన్లు సాధ్యమయ్యాయని , బీసీలకు విద్య , ఉద్యోగం , రాజకీయాలలో కూడా రిజర్వేషన్లు కావాలని నిరంతరం కృషి చేసిన మహనీయుడన్నారు. బీసీ హక్కుల కోసం పదవులను సైతం త్యాగం చేశారని , బీసీ సామాజిక వర్గం ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కుమ్మరి సాయికుమార్ , రమేశ్ తదితరులున్నారు.

కాలం చెల్లిన వస్తువుల అమ్మకాలు!

ఎల్లారెడ్డి, ఆగస్టు 24 : ఫాస్ట్‌ఫుడ్, స్వీట్ హోమ్, కిరాణం దుకాణాల్లో కాలంచెల్లిన సరుకులు విక్రయిస్తూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఓ దుకాణ యజమాని కాలం చెల్లిన కూల్‌డ్రింక్ బాటిల్‌ను విక్రయించాడు. కూల్‌డ్రింక్ తాగుతుండగా దుర్వాసన రావడంతో తయారు చేసిన తేదీని పరిశీలించగా అది కాలం చెల్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై దుకాణదారున్ని నిలదీయడంతో అతను నీళ్ళు నమిలాడు. సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని అధికారులు మామూళ్ళు తీసుకుని పర్యవేక్షణ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలం చెల్లిన వస్తువులు తిని ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని సంబంధిత శాఖ అధికారులు కాలం చెల్లిన వస్తువులు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పీఆర్టీయూ మండల అసోసియేట్ అధ్యక్షుడిగా సుధాకర్

ఏర్గట్ల, ఆగష్టు 25: పీఆర్టీయూ మండల అసోసియేట్ అధ్యక్షుడిగా మైసాల సుధాకర్‌ను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్‌లు నియమించినట్లు ఏర్గట్ల పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా మండల పీఆర్టీయూ సభ్యులు సుధాకర్‌కు వారు అభినందనలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి :ఎస్సై


మాట్లాడుతున్న ఎస్సై

ధర్పల్లి, ఆగస్టు 25: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రామకృష్ణ మండల ప్రజలకు సూచించారు.ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల వల్ల పట్టణాల్లోనే కాకుండా గ్రామస్థాయిలో సైతం ప్రజలు మోసపోతున్నారని అన్నారు. పరిచయంలేని వ్యక్తులతో మాట్లాడటం కానీ, లాటరీ, రుణం ఇస్తామని చెప్పికాల్స్ చేయడం, అనుమానాస్పద లింక్‌లను తెరవడం, బెదిరింపు కాల్స్‌కు స్పందించడం, ఓటీపీలను పంచుకోవడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు జరిగితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. యువత డ్రగ్స్, మత్తుమందు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని హెల్మెట్ తప్పకుండా ధరించాలని వాహనదారులకు సూచించారు. నెంబర్ లేని బండ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.మహిళలు పనిచేసే ప్రదేశాల్లో స్వేచ్ఛగా మరియు సురక్షితంగా జీవించడం మహిళల హక్కు అని వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తే అసభ్యకరంగా ప్రవర్తిస్తే లేదా వేధింపులకు గురిచేస్తే షీటీమ్స్‌కు కానీ లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని మహిళలకు సూచించారు. తమ సమస్యలు నేరుగా పోలీస్ స్టేషన్‌లో చెప్పుకోవాలని ఆయన అన్నారు.యువకులు రాత్రివేళల్లో గస్తీతిరగాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన చెప్పారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ తమ లక్ష్యమని ఆయన అన్నారు.శాంతిభద్రతల కోసం మండల ప్రజలు పోలీసులతో సహకరించాలన్నారు.రాబోయే పండుగలు శాంతియుతంగా సోదరభావంతో జరుపుకోవాలని ఆయనపేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 25: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిల్మాల సురేష్, జిల్లా కన్వీనర్ తెడ్డు గంగారాంలు కోరారు. ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ ఉద్యమ ఫలితంగా సాధించిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతు పలుకుతూ ఆగస్టు 1వ తేదీ సుప్రీం కోర్టు ఏడుగురు జడ్జిల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పును ఇచ్చిందన్నారు. రాష్ట్రాల లో జనాభా ప్రాతిపదికన వర్గీకరణ అమలు చేయాలని తీర్పు ఇచ్చిందని తీర్పు వచ్చి ఇన్ని రోజులైనా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి జీ వోను విడుదల చేయకపోవడం ద్వారా మాదిగ మరియు ఉపకులాలు ప్రస్తుతం రాష్ట్రంలో విద్య, ఉద్యోగాల నోటిఫికేషన్లు మరియు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి ఎస్సీ వర్గీకరణ అమలు జీవోను విడుదల చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సహకరించిన ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టం తీసుకురావాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన రాజకీయ పార్టీలకు, ప్రజాసంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో రమేష్, మారుతి, నరేందర్, శ్రీనివాస్, అబ్బులు, రాములు, సూరజ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా వెళ్తున్న వారికి అన్నదానం


మోస్రాలో అన్నదానం నిర్వహిస్తున్న బజరంగ్‌దళ్ సభ్యులు

మోస్రా,ఆగస్టు25: భక్తి పారవశ్యంతో మల్లారం ఆశ్రమానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని బజరంగ్ దళ్ యువకులు పేర్కొన్నారు. బోధన్ మండలం కల్దుర్కి గ్రామం నుంచి మల్లారం పీఠాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్ ఆశ్రమానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు మోస్రా బజరంగ్ దళ్ యువకులు మోస్రా శ్రీరామాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్దుర్కి గ్రామ భక్తులు మాట్లాడుతూ పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టిన యువకులను అభినందించారు. ప్రతీ సంవత్సరం పాదయాత్రగా వచ్చే భక్తులకు గత నాలుగు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బజరంగ్ దళ్ యువకులు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు భజరంగ్ దళ్ యువకులు, కల్దుర్కి భక్తులు ధన్యవాదాలు తెలిపారు.

డిచ్‌పల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

డిచ్‌పల్లి,ఆగస్టు 25: మండలంలోని ఖిల్లా ప్రభుత్వ పాఠశాల లో 1990-91 లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 33ఏళ్ల తర్వాత విద్యార్థులంత ఒకే చోట కలుసు కోవడంతో సంతోషకర వాతావరణం ఏర్పడింది. వారికి చదువు చెప్పిన గురువులకు ఈ సందర్భంగా శాలువలతో ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు వారివారి కుటుంబ సభ్యుల వివరాలు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం అందరు కలిసిగా సహపంక్తి భోజనాలు చేశారు.

కేజీబీవీలో ప్రమాదకరంగా మారిన గుంత

● ఒకే గదిలో విద్యాభ్యాసం ● సౌకర్యాల కరువు ● పాఠశాలలో దోమల బెడద.. గదుల కొరత


ప్రమాదకరంగా మారిన నీటి గుంత ఇదే..


విద్యార్థుల వస్తువుల మధ్య విద్యాబోధన చేస్తున్న టీచర్లు

బోధన్‌రూరల్,ఆగస్టు25: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రాంగణంలో గతంలో మొరం తవ్వకాలు చేపట్టడంతో అక్కడ గుంత ప్రమాదకరంగా మారింది. గుంతను పూడ్చాలని అనేక మార్లు ఉన్నతాధికారులకు ప్రిన్సిపాల్ హిమబిందు విన్నవించిన పట్టించుకునే వారే కరువయ్యారు. అనుకోకుండా జరగారని సంఘటన జరిగితే బాధ్యతలు ఎవరని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు పాఠశాల ప్రాంగణంలోకి చేరడంతో పాఠశాల చిన్న చెరువులా తలపిస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా గుంతను సందర్శించి పూడ్చాలని కోరుతున్నారు.

● గదుల కొరత.. దోమల బెడద

కస్తూర్బా గాంధీ పాఠశాలలో గదుల కొరత ఉండడంతో ఒకే తరగతి గదిలో విద్యార్థులు చదువుతో పాటు అసౌకర్యాల మధ్య ఉంటున్నారు. తరగతి గదుల్లోనే రాత్రిపూట విద్యార్థులు అక్కడే బస చేస్తున్నారు. అదనపు తరగతి గదులు నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు గదులు సరిపోక పోవడంతో ఒకటే గదిలో అసౌకర్యాల మధ్య చదువుకుంటున్నారు. పాఠశాల ప్రాంగణం పైభాగంలో మొరం తవ్వకాలు జరిగేవి. వర్షానికి మొరం పాఠశాల ప్రాంగణానికి చేరుకుంది. పాఠశాలకు వర్షపు నీరు చేరడంతో దోమలు తీవ్రంగా వ్యాపిస్తున్నాయి. దోమల బెడదతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థినుల సౌకర్యార్థం దోమ తెరలను ఇప్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు. ఉదయం చదువులు అయిపోగానే సాయంత్రం అదే రూమ్‌ల్లో బెంచీలు జరిపి బస చేస్తున్నారు. పాఠశాలకు అవసరమైన తరగతి గదులు నిర్మించాలని విద్యార్థినులు కోరుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో గతంలో మొరం తవ్వకాలు చేపట్టడంతో గుంత ప్రమాదకరంగా మారింది. గుంతను పూడ్చాలని అనేకమార్లు ఉన్నతాధికారులకు ప్రిన్సిపాల్ విన్నవించిన పట్టించుకునే వారే కరువయ్యారు. ఎటువంటి అనుకుని సంఘటన జరగముందే ప్రమాదకరంగా మారిన నీటిగుంతను పూడ్చాలని విద్యార్థులు కోరుతున్నారు. వర్షకాలంలో వర్షపు నీరు పాఠశాల ప్రాంగణంలోకి చేరడంతో బురదమయంగా మారి పాఠశాల చిన్న చెరువులా కనిపిస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైన సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అదనపు తరగతి గదులు నిర్మించాలని, ప్రమాదకరంగా మారిన నీటిగుంతను పూడ్చివేయాలని కోరుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో ప్రమాదకరంగా మారిన నీటి గుంతలో నీరు నిల్వడంతో దోమల బెడద అధికంగా మారింది. సాయంత్రం అయిదంటే చాలు దోమలు గుయ్ గుయ్ అంటూ తిరుగుతున్నాయి. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం దోమ తెరలను ఇప్పించాలని, కిటికిలకు జాలీలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

● అసంపూర్తిగా కొత్త బిల్డింగ్

కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న బిల్డింగ్ అసంపూర్తిగా మారింది. వెంటనే పనులు ప్రారంభించి బిల్డింగ్ నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు సమస్యలు ఉండవు.

తరగతి గదుల్లోనే అసౌకర్యాల మధ్య బస



తమ పాఠశాలలో ఉపాధ్యాయ బృందం విద్యభ్యాసం బాగున్న పాఠశాల పూర్తయిన తర్వాత సరిపడ గదులు లేక ఈ తరగతి గదుల్లోనే అసౌకర్యాల మధ్య బస చేస్తున్నాం. సంబంధిత అధికారులు స్పందించి అదనపు తరగతి గదులను నిర్మించాలి.

● అమూల్య, ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీ, బోధన్

పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీటితో ఇబ్బంది



వర్షకాలంలో పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీటితో పాటు మొరం కొట్టుకురావడంతో బురదమయంగా పాఠశాల ప్రాంగణం మారుతుంది. పాఠశాల నుంచి బయటకు వెళ్లలన్న, లోపలికి రావాలన్న అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పాఠశాల గదుల్లోనే పెట్టెలు, బాక్స్‌లు, ఇతర వస్తువులు తరగతి గదిలోనే పెట్టుకోవాల్సి వస్తుందని దీని వల్ల విద్యార్థులందరరికీ అసౌకర్యం ఉంది.

-కె.దీపిక, ఇంటర్ ఫస్ట్‌ఇయర్ బైపీసీ, బోధన్

ప్రజలకు ఏ అవసరం ఉన్నా తక్షణమే స్పందిస్తా

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా


ఎల్‌వోసీ కాపీని అందజేసిన అర్బన్ ఎమ్మెల్యే

పెద్దబజార్, ఆగస్టు 25: ప్రజలకు ఏ అవసరం ఉన్నా తక్షణమే స్పందించి ఆదుకుంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని శివాజీనగర్‌కు చెందిన ఆర్.మోహన్ గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స నిమిత్తం కోసం రూ.రెండు లక్షల 50 వేల ఎల్‌వోసీ కాపీని ఆయన కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో మాట్లాడి సీఎం సహాయ నిధికి లేఖ సిఫారసు చేయడం జరిగిందని వెంటనే స్పందించిన అధికారులు లేఖకు స్పందించి రూ.రెండు లక్షల 50వేల ఎల్‌వోసీ కాపీని అందజేశారు. ఎల్‌వోసీ మంజూరు పట్ల మోహన్ కుటుంబ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణకు ధన్యవాదాలు తెలియజేశారు.

కల్లు డిపో అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా ?

● నిబంధనలకు వ్యతిరేకంగా స్థానికేతరులే సభ్యులు
● ఆధారాలు ఉన్నాయని, తప్పుడు ఆరోపణలు చేయడం లేదు: శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న బీసీ యువజన సంఘం అధ్యక్షుడు

ఖిల్లా,ఆగస్టు 25: నగరంలో కొనసాగుతున్న మూడో కల్లు డీపో అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని, తప్పుడు ఆరోపణలు చేయడం లేదని, నిబంధనలకు వ్యతిరేకంగా స్థానికేతరులే సభ్యులుగా ఉన్నట్లు తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని బీసీ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తులు నగరంలో తప్పుడు చిరునామాతో ఆధార్‌కార్డులను పొంది డీపోలో సభ్యులుగా చెలామణి అవుతున్నారని ఆరోపించారు. మూడో కల్లు డీపో కోసంపోరాటం చేసిన నిజమైన గీతకార్మికులు లేకుండానే గీతకార్మికుల బైలా ప్రకారం డీపోను నడుపుతున్నారని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. సొసైటీ బైలా ప్రకారం వచ్చిన లాభాలను గీతకార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలన్నారు. కాని తమ సొంతానికి వాడుకుని కోట్ల రూపాయల ఆస్తులను కూడగట్టుకుంటున్నారని ఆరోపించారు.ఈవిషయంపై అధికారులు విచారణ జరిపి తక్షణమే నూతన కార్మికులను తీసుకోవాలని కోరారు. కుల బహిష్కరణకు గురైన రాజగోపాల్‌గౌడ్‌కు ఆయన కల్లుడీపోను ఆయనకు తిరిగి ఇచ్చి వేయాలని కోరారు. ఈ సమావేశంలో గౌడ సంఘం నాయకులు రాజగోపాల్‌గౌడ్, సిరిగాధ స్వామిగౌడ్,బాబాగౌడ్, అశోక్,అఖిల్‌గౌడ్, రాజ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏబీసీ సెంటర్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్


నిరాశ్రయులతో మాట్లాడుతున్న కమిషనర్

సుభాష్‌నగర్,ఆగస్టు 25:నగరంలోని ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ పరిశీలించారు. నగరంలోని పాత కలెక్టరేట్ ముందర గల ఏబీసీ సెంటర్‌ను పరిశీలించి సెంటర్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు కుక్కలకు నియంత్రణ ఆపరేషన్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏబీసీ సెంటర్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజ్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పట్టణ నిరాశ్రయుల సర్వే నిర్వహించిన కమిషనర్

నగరంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ నిరాశ్రయుల సర్వేను మెప్మా అధికారులతో కలిసి నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ నిర్వహించారు. శనివారం రాత్రి 11 నుంచి అర్ధరాత్రి 1గంట వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ నిరాశ్రయుల జాబితాను తయారు చేశారు. నగరంలోని రైల్వే స్టేషన్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ సర్వే నిర్వహించారు. నిరాశ్రయులకు నగరంలో భవనం ఉందని వారు రోడ్డుపైన కాకుండా నిరాశ్రయుల భవనంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారి రాజేందర్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● భోజనంలో బొద్దింక.. హోటల్‌కు జరిమానా

నగరంలోని మోక్ష హోటల్‌లో భోజనంలో బొద్దింక రావడంతో హోటల్ యజమానులకు జరిమానా విధించారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో బిర్యాని ఆర్డర్ చేయడంతో దాంట్లో బొద్దింక కనబడటంతో ఫోన్ ద్వారా వినియోగదారుడు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ సిబ్బందిని హోటల్‌కు పంపించి తనిఖీలు నిర్వహించారు. అనంతరం యాజమాన్యానికి నోటీసులు ఇచ్చి రూ.5వేల జరిమానా విధించారు. కిచెన్ శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.

నేడు కోటగిరి మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

కోటగిరి,ఆగస్టు25: కోటగిరి మార్కెట్ కమిటీ పాలకవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా హన్మంతు, ఉపాధ్యక్షుడిగా అనిల్‌తో పాటు పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు హాజరుకానున్నారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షహీద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలిరావాలని ఆయన కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నవీపేట,ఆగస్టు25: మండలంలోని నందిగామకు చెందిన ఇందిరా అనే మహిళ శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబం నిరుపేదకు చెందిన వారు కావడంతో గ్రామానికి చెందిన మానిక్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజీవ్, భూంరావ్, రాజశేఖర్, తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూస్తాం : ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి


దేగాంలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు25: ప్రభుత్వ పథకాలను నిజమైన లబ్ధిదారులకే అందేలా చూస్తానని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు.ఆదివారం ఆర్మూర్ మండలం పిప్రి,దేగాం, ఆలూర్ గ్రామాలలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న వారికి సీఎం సహాయనిధి మంజూరు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో చెక్కులు మంజూరయ్యాయన్నారు.ప్రతీపథకం తమ కు చెందాలని, డబ్బులు ఉన్న వారు కూడా ఆశపడడం సరికాదన్నారు. అర్హులైన లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలు అందినప్పుడు నిజమైన అభివృద్ధి జరుగుతుందన్నారు.త్వరలోనే గృహలక్ష్మీపథకం ద్వారా ఇళ్లు లేనివారికి డబ్బులు మంజూరవు తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మండల పార్టీ అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, యాదగిరి, ముత్తెన్న, హరిష్, తదితరులు పాల్గొన్నారు.

మగ్దుం మొహియుద్దీన్ సేవలను గుర్తించాలి


చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పెద్దబజార్,ఆగస్టు25:అమరుడు, మహాకవి మగ్దుం మొహియుద్దీన్ సేవలను గుర్తించాలని సీపీఐ రాష్ట్రనాయకుడు కె.భూమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శిపి.సుధాకర్‌లు అన్నారు.ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా వర్ధంతిని నిర్వహించారు.ఈసందర్భంగావారు మాట్లాడుతూహైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ప్రభుత్వం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని నైజాం నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ ఆనాటి తెలంగాణలో రజాకార్ల వ్యవస్థకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటానికి పిలుపునిచ్చిన నాయకుడు అని అన్నారు. ప్రజలు చైతన్యవంతులై నైజాంను తరిమికొట్టి తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేసుకోవడం జరిగిందన్నారు.ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజేశ్వర్, గంగారాం, రంజిత్, గంగాధర్, ఫిరోజ్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా ఆర్‌అండ్‌బి రోడ్లు


గుంతగా ఏర్పడిన రోడ్డు

డిచ్‌పల్లి, ఆగస్టు 25 ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆర్ అండ్‌బీ రోడ్లు గుంతలమయండా మారాయి. డిచ్‌పల్లి-నిజామాబాద్ ప్రధాన రోడ్డు డిచ్‌పల్లి గ్రోమోర్ వద్ద గుంతలమయంగా మారింది. నడిపల్లి జీ కన్వెన్షన్ వద్ద కల్వర్టు పనులు జరుగుతున్న ప్రాంతంలో పూర్తిగా గుంతలు ఏర్పడ్డాయి. అలాగే మిట్టపల్లి-కమలపూర్ గ్రామాల రోడ్డులో భారీ గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతల రోడ్డుతో నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయని, కావున వెంటనే ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, గ్రామస్థులు కోరుతున్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74300	రూ.68,500	రూ.900

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : స్త్రీ-2 (హిందీ) (10.00, 4.30, 10.50)
: కమిటీ కుర్రాళ్లు (1.15)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.45)
స్క్రీన్-2 : ఏలియన్ రొమ్ములస్ (10.15)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (1.00)
: తంగాలన్ (4.05)
: స్త్రీ-2 (హిందీ) (7.25)
: మారుతినగర్ సుబ్రమణ్యం (10.40)
స్క్రీన్-3 : డిమోంటి కాలనీ-2 (10.20, 4.40, 10.30)
: స్త్రీ-2 (హిందీ) (1.25)
: ఏలియన్ రొమ్ములస్ (ఇంగ్లీష్) (7.45)
స్క్రీన్-4 : మారుతినగర్ సుబ్రమణ్యం (10.00)
: తంగాలన్ (1.10)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.30)
: కమిటీ కుర్రాళ్లు (7.35)
: ఇంద్ర (10.50)



ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (10.20, 4.20, 10.20)
: తంగలాన్ (1.20, 7.20)
స్క్రీన్-2 : డిమోంటి కాలనీ-2 (10.25, 10.20)
: స్త్రీ-2 (హిందీ) (1.30)
: కమిటీ కుర్రాళ్లు (4.30)
: మారుతినగర్ సుబ్రమణ్యం (7.30)
స్క్రీన్-3 : స్త్రీ-2 (హిందీ) (10.20, 10.20)
: మారుతినగర్ సుబ్రమణ్యం (1.20)
: డిమోంటి కాలనీ-2 (4.20)
: డబుల్ ఇస్మార్ట్ (7.10)

దేవి : తంగలాన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : డబుల్ ఇస్మార్ట్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్